

ఆందోళన చేస్తున్న కార్మికులు



సమావేశంలో మాట్లాడుతున్న రాధికాగుప్తా

స్పౌజ్ పింఛన్లు అందేలా చర్యలు తీసుకోవాలి

» మేడ్చల్ అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

కీసర, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): చేయూత పింఛన్లలో పెండింగ్ కేసులను పరిశీలించి, మరణించిన కేసులను అప్‌డేట్ చేసి స్పౌజ్‌కు పింఛన్లు అందేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రాధికా గుప్తా సూచించారు. మంగళవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. అంగన్‌వాడీ సెంటర్లు, ఇందిరమ్మ ఇళ్ల తదితర అంశాలపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలాల వారీగా కొన్ని నెలలుగా పంపిణీ కాకుండా బ్యాంకుల్లో, పోస్టాఫీసలలో పెండింగ్‌లో ఉన్న చేయూత పింఛన్లను వెంటనే అప్‌డేట్ చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ల వద్ద ఉన్న జనరల్ నిధులతో ఎన్యూటరేటర్లకు విధులు నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్లకు వేతనాలు చెల్లించాలన్నారు. అలాగే మండలాల వారీగా ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులను పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కాంతమ్మ, డీఆర్‌డీవో సాంబశివరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోసిన్, రమణమూర్తి, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న సుధీర్

వైకల్యం ఉన్నవారిని గుర్తించాలి

» వికారాబాద్ అదనపు కలెక్టర్ సుధీర్

మర్పల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అంగవైకల్యం ఉన్న పిల్లలు, పెద్దలను గుర్తించాలని అదనపు కలెక్టర్ సుధీర్ అధికారులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంసీఎం ఫంక్షన్ హాలులో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి, ఆకార్ ఆశా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు, పెద్దల్లో పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించేలా సూచనలు చేశారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరమణ ప్రభుత్వాసుపత్రిని పరిశీలించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో జయసుధ, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు భారతేంద్ర, మంజుల, శాలిని, ఉప వైద్యాధికారి జవరాజ్, వైద్యులు మానస, హర్ష, విజయ్‌కుమార్, మండల అధికారులు పాల్గొన్నారు.



ప్రైవేట్‌కు దీటుగా

నిలబడి!


విద్యార్థుల సంఖ్య పెంపునకు కసరత్తు

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రానున్న విద్యా సంవత్సరం నుంచి ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెరిగేలా ప్రత్యేకంగా దృష్టి సారించింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువ సదుపాయాలు కల్పిస్తున్నా ప్రైవేట్ వైపే మొగ్గు చూపుతున్న విషయం తెలిసిందే. జిల్లాలో 1,068 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 776 ప్రాథమిక, 116 ప్రాథమికోన్నత, 176 ఉన్నత పాఠశాలలు ఉండగా, 84 వేల మంది వరకు విద్యార్థులు ఉన్నారు. బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించడంతో పాటు బడి మానేసిన విద్యార్థులను చేర్చుకునేందుకు వీలుగా కార్యాచరణ సిద్ధం చేశారు.

- వేసవి సెలవుల్లో బడిబాటపై ప్రత్యేక శిక్షణ
- హాజరుకానున్న ఉపాధ్యాయులు
- ప్రవేశాలతో టీచర్లకు ప్రత్యేక పాయింట్లు ఇచ్చి ప్రోత్సాహం
- కార్యాచరణ సిద్ధం చేసిన విద్యాశాఖ అధికారులు
- ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం దిశగా అడుగులు
- జిల్లాలో 1,068 స్కూళ్లు.. 84 వేల మంది విద్యార్థులు

వికారాబాద్, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన విద్యాశాఖపై జరిగిన సమావేశంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి అవసరమైన అంశాలన్నీ చర్చించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఒక్కో విద్యార్థిపై రూ.80 వేల వరకు ప్రభుత్వం ఖర్చు చేస్తోందని, విద్యార్థులకు చదువుతో పాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం దుస్తులు, మధ్యాహ్న భోజనం, నోట్ బుక్కులు అందజేస్తోంది. ప్రభుత్వం విద్యార్థులకు పలు సదుపాయాలు కల్పిస్తున్నా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి దారితీస్తున్న కారణాలపై చర్చ జరిగింది. క్షేత్ర స్థాయిలో పరిస్థితులపై అధ్యయనం చేసిన విద్యా కమిషన్ పాఠశాలల బలోపేతానికి

మిగతా 8వ పేజీలో...



విద్యార్థులను చేర్పించే టీచర్లకు ప్రోత్సాహం ..

విద్యార్థుల చేరికలను ప్రోత్సహించేందుకు తల్లిదండ్రులకు ఏయే అంశాలు వివరించాలనే విషయమై ఉపాధ్యాయులకు బడిబాట శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. తల్లిదండ్రుల నుంచి ఎదురయ్యే ప్రశ్నలకు సమాధానాలు చెప్పే విధంగా రిసోర్స్ పర్సన్లతో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఉపాధ్యాయులు వేసవి సెలవుల్లో విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, విద్యార్థులకు ప్రభుత్వం కల్పించిన సదుపాయాల గురించి తల్లిదండ్రులకు వివరించనున్నారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా వారికి అవగాహన కల్పించే ప్రయత్నం చేయనున్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా ఉపాధ్యాయులకు విద్యా శాఖ అధికారులు లక్ష్యాలను నిర్దేశించనున్నారు. పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించే ఉపాధ్యాయులను ప్రోత్సహించనున్నారు. పాఠశాలలో చేర్పించిన విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయులకు పాయింట్స్ ఇచ్చి ప్రోత్సహిస్తారు. పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించే ఉపాధ్యాయులకు ఇచ్చే పాయింట్లను పదోన్నతులు, బదిలీల సమయంలో ఉపయోగపడే విధంగా సర్వీస్ పుస్తకాల్లో నమోదు చేస్తారు. పాయింట్స్ ఇచ్చి ప్రోత్సహించడం వల్ల ఉపాధ్యాయులు విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేస్తారని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు.

నాలుగు నెలలుగా జీతాల్లేవ్

» నిరసన వ్యక్తం చేస్తున్న జీపీ కార్మికులు

శామీర్‌పేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నాలుగు నెలలుగా జీతాలను చెల్లించకపోవడంతో పంచాయతీ కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శామీర్‌పేట మండలం లాల్‌గడి మలక్‌పేట పంచాయతీ కార్యాలయం ఎదుట వారం రోజులుగా కార్మికులు ఆందోళన చేస్తున్నారు. మంగళవారం నిరసనలో పాల్గొన్న కార్మికులు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల పట్ల ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. నిత్యం చెత్తాచెదారాన్ని తొలగిస్తూ పల్లెలను పరిశుభ్రం చేస్తున్న కార్మికులకు ప్రభుత్వం జీతాలను చెల్లించక పోవడం శోచనీయమన్నారు. 11వ తేదీ లోపు ప్రభుత్వం స్పందించి జీతాలను చెల్లించపోకతే 12వ తేదీ నుంచి అన్ని సేవలను పూర్తి స్థాయిలో నిలిపివేసి జిల్లా స్థాయిలో పెద్దఎత్తున ఆందోళనలను చేపడుతామని హెచ్చరించారు.

రేపు ఐటీఐ క్యాంపస్‌లో జాబ్‌మేళా

వికారాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): శ్రీ మంత్ర టెక్నాలజీస్ సంస్థలో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాని జిల్లా ఉపాధి కల్పనా అధికారి షేక్ అబ్బుస్ సుభాన్ ఒక ప్రకటనలో సూచించారు. రేపు(10వ తేదీన) ఐటీఐ క్యాంపస్‌లో ఉదయం 10.30 గంటలకు జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పదో తరగతి ఇంటర్మీడియట్ ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా, ఇంజినీరింగ్ విద్యార్హత కలిగి ఉండాలని ఆయన అన్నారు. ఎంపికైన వారు హైదరాబాద్‌లో పని చేయాల్సి ఉంటుందన్నారు. ఎంపిక అయిన వారికి ఉచిత వసతితో కూడిన శిక్షణ, ఉద్యోగం కల్పించబడుతుందన్నారు. ఇతర వివరాలకు 96760047444, జాబ్ మేళా నిర్వాహకుడు మియాసాబ్‌ను సంప్రదించాలని సూచించారు.



ఘనంగా జగదాంబ ఉత్సవాలు



పెద్దేముల్ మండల పరిధిలోని జయరాం తండాలో శ్రీజగదాంబ దేవి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఐదురోజులుగా సాగుతున్న ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. మధ్యాహ్నం అమ్మవారి పల్లకీ సేవ నిర్వహించి గుడిపై కలశాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి వేళ మహారాష్ట్రకు చెందిన మధుకర్ మహారాజ్, అకోలా అనిల్ మహారాజ్ ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు కొనసాగాయి. కాగా, అంతకు ముందు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బాబుసింగ్, గుడిచైర్మన్ రామ్‌శెట్టి, గ్రామపెద్దలు కమలాకర్, శంకర్‌చౌహాన్, ప్రతాప్, నర్సింగ్, పుండాలిక్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

- పెద్దేముల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి)

మెరుగైన వైద్యసేవలు అందించాలి

మోమిన్‌పేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి వెంకటరవణ సూచించారు. మంగళవారం మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరమైన మందులను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆశా వర్కర్లు గ్రామాల్లో అందుబాటులో ఉంటూ గర్భిణులు, చిన్నారులు, వృద్ధులకు సకాలంలో వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుజల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు, ఈతకు వెళ్లి మరో ఇద్దరు.. 7



భూమీకి పచ్చాని రంగేసినట్టు..

వ్యవసాయ భూములు ప్లాట్లుగా మార్చి భవనాలు నిర్మిస్తున్న తరుణంలో కీసరకు అనుకొని కనుచూపు మేరలో పచ్చని పైరు 'భూమీకి పచ్చాని రంగేసినట్లు' కనువిందు చేస్తోంది. కీసర నుంచి భోగారం వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఉన్న పచ్చని వరిపంట అటుగా వెళ్లే వాహనదారులను ఆకట్టుకుంటోంది.

-కీసర, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి)

నాపరాయి రాయల్టీపై రచ్చ!

కర్ణాటక, తెలంగాణ మధ్య పంచాయితీ

- 11న సీఎం రేవంత్‌తో ఇరు రాష్ట్రాల స్టోన్ ప్రతినిధుల సమావేశం
- చర్చకు రానున్న తాండూరు, కర్ణాటక రాష్ట్రం మిరియాణ్ వ్యాపారులు



తాండూరులోని నాపరాయి గని

తాండూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తాండూరు, పొరుగున ఉన్న కర్ణాటక రాష్ట్రం మిరియాణ్ నాపరాయి వ్యాపారుల మధ్య రాయల్టీ చెల్లింపుల విషయంలో రచ్చ కొనసాగుతోంది. నెల రోజులుగా ఈ విషయంలో మైన్స్ అధికారులకు అనేక ఫిర్యాదులు అందాయి. గతంలో నామమాత్రపు రాయల్టీలతో అటు కర్ణాటక రాష్ట్రం మిరియాణ్ నుంచి, తాండూరు నుంచి వందలాది లారీల్లో నాపరాయి రవాణా జరిగేది. అయితే కర్ణాటక నుంచి వచ్చే నాపరాయికి ఇటీవల మైన్స్ అధికారులు ప్రతీ లారీకి తప్పనిసరిగా రాయల్టీ చెల్లించాలని తనిఖీలు ముమ్మరం చేశారు. అయితే తాండూరు మండలం ఓగిపూర్, కరన్‌కోట్, బషీరాబాద్, మల్కాపూర్ తదితర ప్రాంతాల నుంచి పాలిషింగ్ యూనిట్లకు వచ్చే నాపరాయికి మాత్రం ఒకే రాయల్టీ మీద మూడు నుంచి నాలుగు లారీలను పంపిస్తూ చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని కర్ణాటక వ్యాపారులు ఆరోపిస్తున్నారు. కర్ణాటక నుంచి తాండూరుకు వచ్చే నాపరాయి రవాణాపైన కేవలం రాయల్టీ మాత్రమే కన్నడ ప్రభుత్వానికి వెళ్తుందని, కాగా, తాండూరుకు వచ్చే



తాండూరులో సీజ్‌చేసిన కర్ణాటక నాపరాయి లారీలు(ఫైల్)

మిగతా 8వ పేజీలో...

చీమలదరిలో అభివృద్ధి భేష్

మోమిన్‌పేట్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలదరి గ్రామంలో అభివృద్ధి పనులు భేష్‌గా ఉన్నాయని ఉత్తరప్రదేశ్ అధికారుల బృందం పేర్కొంది. చీమలదరిలో మంగళవారం ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చిన పంచాయతీ బ్లాక్ అధికారులు, కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంపీవో యాదగిరి గ్రామంలో జరిగిన అభివృద్ధిపై పవర్ ప్రజెంటేషన్ ద్వారా వారికి వివరించారు. అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు పంచాయతీలో రికార్డులను ఆన్‌లైన్ చేసినట్లు తెలిపారు. ఇంటి పన్ను వసూలు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, నీటి పన్ను, గృహ నిర్మాణ అనుమతులు, జంతు అమ్మకాల అనుమతులు తదితర వాటిని ఆన్‌లైన్ చేసినట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ అధికారులు, ప్రజాప్రతినిధులు, డీఎల్‌పీవో సంధ్యారాణి, ఏపీవో శంకరయ్య, ఈసీ వికాస్, పంచాయతీ కార్యదర్శులు భరత్, సుగుణ, కంప్యూటర్ ఆపరేటర్ వెంకట్, మాజీ ఉప సర్పంచ్ కొమురయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.



చీమలదరిలో ఉత్తరప్రదేశ్ అధికారుల బృందం

వేంకటేశుడి హుండీ ఆదాయం రూ.1.06లక్షలు

పరిగి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పరిగిలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని హుండీని మంగళవారం లెక్కించారు. ఇటీవల వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు జరిగాయి. ఆలయ ఆవరణలో ఆలయ కమిటీ ఛైర్మన్ సిద్ధాంతి పార్థసారథి, కమిటీ సభ్యులు ఇగోపాల్, సురేఖ, ఈవో శ్రీనివాస్, పరిశీలకులు బాలనర్సయ్య, ఎస్సీ బాబయ్య సమక్షంలో హుండీ లెక్కించారు. మొత్తం ఆదాయం రూ.1,06,315 వచ్చిందని ఈవో శ్రీనివాస్ తెలిపారు.

సీడబ్ల్యూసీ సమావేశంలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే


సమావేశంలో చల్లా వంశీచంద్‌రెడ్డి

ఆమనగల్లు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) సమావేశంలో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే, సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచంద్‌రెడ్డి పాల్గొన్నారు. దేశంలో పార్టీ బలోపేతంపై సమావేశంలో చర్చించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి సమావేశంలో పాల్గొనేందుకు మంత్రి జూపల్లి కృష్ణారావు, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి గుజరాత్ వెళ్లారు. రెండు రోజులు సమావేశాలుంటాయి.


అహ్మదాబాద్‌కు బయలుదేరిన ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ ఇవ్వాలి

శంకర్‌పల్లి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం పెన్షన్ ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి తెలిపారు. ఈ నెల 21, 22వ తేదీల్లో శంషాబాద్‌లో జరిగే రాష్ట్ర బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం శంకర్‌పల్లిలో పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఆయన మాట్లాడుతూ... నిర్మాణ రంగ కార్మికులకు ప్రభుత్వం సదుపాయాలు కల్పించాలన్నారు. 60సంవత్సరాలు నిండిన కార్మికులకు పెన్షన్ విధానాన్ని ప్రభుత్వం అమలు చేయాలన్నారు. శంషాబాద్‌లో నిర్వహించే బహిరంగ సభకు కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి సుధీర్, గోపాల్‌రెడ్డి, శేఖర్, నర్సింలు, చంద్రయ్య, మొగులయ్య, రాజు, రాములు, నర్సింలు, సాయిలు ఉన్నారు.


శంకర్‌పల్లిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నిర్వహణ లేక నిరుపయోగం

● నాగారంలో మరుగుదొడ్లకు తాళం!

కీసర రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా నాగారం మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన పబ్లిక్ మరుగుదొడ్లు వినియోగంలో లేవు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా ఏర్పాటు చేసిన మరుగుదొడ్ల నిర్వహణ కరువైంది. బహిరంగ మలమూత్ర విసర్జన నియంత్రిచడం, పర్యావరణ పరిరక్షణకు రూ.లక్షలు వెచ్చించి కాలనీలు, ప్రధాన రోడ్డులో ప్రజామరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. తొలుత వాటిని బాగానే చూసినప్పటికీ కాలక్రమేణ నిర్వహణను గాలికొదిలారు. వ్యాపారులకు దుర్వాసన వస్తోందని నా గారం ప్రధాన రోడ్డులో ఏర్పాటు చేసిన ఓ మరుగుదొడ్డికి తాళం వేశారు. దీంతో జనం పక్కనే ఉన్న మురుగు కాలువ వద్ద మూత్రవిసర్జన చేస్తున్నారు. చికెన్, చేపల దుకాణాల వ్యర్థాలతో వస్తున్న దుర్వాసన, మలమూత్ర విసర్జితాల కంపుతో ప్రజలు భరించలేకపోతున్నారు. నాగారం-రాంపల్లి రోడ్డులో ఏర్పాటు చేసిన మరో మరుగుదొడ్డి అలంకార ప్రాయంగా మారింది. ఇలా మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన మరుగుదొడ్లన్నీ మూలనపడ్డాయి. వాటి నిర్వహణ శానిటేషన్ విభాగానిదని ఇంజనీరింగ్ శాఖ, ఇంజనీరింగ్ సెక్షన్‌దేనని శానిటేషన్ విభాగం వారు ఒకరిపై మరొకరు నెట్టుకుంటూ తప్పించుకుంటున్నారు. ఈ దుస్థితిపై ప్రజలు మండిపడుతున్నారు. వివిధ పనుల నిమిత్తమై పట్టణానికి వచ్చే ప్రజలు, వాహనదారుల అత్యవసర అవసరాలను తీర్చుకునేందుకు మరుగుదొడ్లు లేక ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు స్పందించి ప్రజా మరుగుదొడ్లకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


నాగారంలోని మారుతీనగర్ ఫంక్షన్ హాల్ సమీపంలో వినియోగంలోలేని మరుగుదొడ్డి

వినియోగంలోకి తెచ్చేలా చర్యలు

నిర్వహణ లేకపోవటంతో పాటు, ప్రమాదాల్లో వాహనాలు ఢీకొని పాడవడంతో ప్రజలు మరుగుదొడ్లు వాడడం లేదు. ఇంజినీరింగ్ విభాగ అధికారులతో అంచనా వేసి మరమ్మతుకు చర్యలు తీసుకుంటాం. రోడ్డు విస్తరణలో భాగంగా నాగారం-రాంపల్లి రోడ్డులోని టాయిలెట్స్ తొలగించాల్సిన ఉంది. వీటి స్థానంలో మరోచోట మరికొన్ని ప్రజా మరుగుదొడ్ల నిర్మాణాలు చేపడుతున్నాం.

- భాస్కర్‌రెడ్డి, నాగారం మున్సిపల్ కమిషనర్

రాజ్యాంగాన్ని పరిరక్షించేది కాంగ్రెస్ ప్రభుత్వమే

కందుకూరు, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి):జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదాలతో కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగాన్ని పరిరక్షిస్తుందని పీసీసీ ప్రచార కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ కృష్ణానాయక్, మాజీ జడ్పీటీసీ జంగారెడ్డి అన్నారు. మంగళవారం ఆకులమైలారం, గుమ్మడవెల్లి తండా, మీర్కాన్‌పేటల్లో జై సంవిధాన్‌పై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని తొక్కేస్తూ మతచిచ్చుతో మోదీ ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర మంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌ను అవమానించేలా మాట్లాడారని అన్నారు. దేశం అన్ని రంగాల్లో బలమైందని తెలియజెప్పేందుకే తమ పార్టీ ప్రజలను చైతన్యపరుస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ కె.విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్‌గౌడ్, అఫ్జల్‌బేగ్, జగన్, ఢిల్లీ శ్రీధర్, అజీజ్, సురేందర్, పి.శ్రీనివాస్, మహేందర్, కుమార్, బి.పాండురంగారెడ్డి, వి.బాబు, శేఖర్, యాదగిరి, శ్రీకాంత్, సాయిలు పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

మీర్కాన్‌పేటలో ఘనంగా రథోత్సవం


పురవీధుల్లో రథాన్ని లాగుతున్న భక్తులు

కందుకూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమిని పురస్కరించుకొని మంగళవారం ఉదయం మీర్కాన్‌పేటలో రథోత్సవాన్ని జరుపుకున్నారు. సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఏటా గ్రామంలో నాలుగు రోజులు నిర్వహిస్తారు. మంగళవారం ఏకాదశిని పురస్కరించుకొని రామలింగేశ్వరస్వామి ఆలయంలోని రథాన్ని పూలతో అలంకరించి తెల్లవారు జామున 3:10గంటలకు రథపూజ నిర్వహించారు. ఉదయం 4 గంటల నుంచి రెండు గంటల పాటు గ్రామంలోని వీధుల్లో రథాన్ని వందలాది మంది యువకులు జై శ్రీరామ్ అంటూ లాగారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జ్యోతిచంద్రశేఖర్, నర్సింహ, మాజీ ఎంపీటీసీ డి.రాంచందర్, సంతోష్‌కుమార్, మదన్‌పాల్‌రెడ్డి, శంకర్, క్రిష్ణ, వెంకటేశ్ పాల్గొన్నారు.

కంపెనీ కాలుష్యంతో ప్రజల ఇబ్బందులు


మోమిన్‌పేట్ శివారులో ఓ కంపెనీ నుంచి వెలువడుతున్న పొగ

మోమిన్‌పేట్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్పల్లికి వెళ్లే దారిలో ఓ కంపెనీ గొట్టాల ద్వారా వెలువడుతున్న పొగతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలుష్యంతో వేగలేకపోతున్నామని స్థానికులు వాపోయారు. కొన్ని రోజులుగా కంపెనీ వద్ద గొట్టాల ద్వారా విపరీతమైన కార్బన్‌డయాక్సైడ్ వదులుతున్నారని, అక్కడి వాతావరణం కాలుష్యంతో పొగమంచులా మారుతోందని తెలిపారు. గాలి పీల్చుకుంటే పొగ లోపలికి వెళ్తోందని, కాలుష్యంతో పొలాల్లో పంటలు నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్య నియంత్రణ మండలి, స్థానిక అధికారులు కంపెనీ యజమానిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



భక్తిశ్రద్ధలతో నారసింహుడి కల్యాణం

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌లోని పెద్ద జానమ్మపేట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు నేతృత్వంలో వేద పండితులు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అంతకు ముందు ధ్వజాదివాస హోమం, ధ్వజారోహణం, బలిహరణం చేశారు. సంతానం కోసం పలువురు మహిళలు గరుడ ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ శ్యాంసుందర్‌రెడ్డి, పట్టణ ప్రముఖులు బాల్‌రాజ్‌గుప్తా, పరిగి వెంకటసాయీశ్వర్‌రెడ్డి, కిషోర్, కానుగు అంతయ్య, లింగారం కుమార్‌గౌడ్, రాంభూపాల్, నర్సింహులుగుప్తా, మధు, అగీరు శ్రీనివాస్, ఎండోమెంట్ ఈవో శివకుమార్ పాల్గొన్నారు.

విద్యారంగానికి 15% నిధులు కేటాయించాలి

వికారాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కనీసం 15శాతం నిధులు కేటాయించాలని, ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్య తరగతులను ప్రారంభించాలని టీయూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటప్ప అన్నారు. మంగళవారం వికారాబాద్‌లోని టీయూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చి 15నెలలు గడుస్తున్నా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. మేనిఫెస్టులో పేర్కొన్న హామీలను అమలు చేయడంలేదన్నారు. బకాయిపడిన ఐదు వాయిదాల డీఏను వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీని నివేదికపై సంఘాలతో చర్చించి అమలు చేయాలని, ఉద్యోగులు, జర్నలిస్టుల ఆరోగ్య సంరక్షణ పథకం సక్రమంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం, జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు, నాయకులు వెన్నల, సత్యం తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాల్లో సంతోషమే ధ్యేయం

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పేదల కుటుంబాల్లో సంతోషమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తూర్‌లో సన్న బియ్యం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం రేవంత్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిములు గౌడ్, నాయకులు భీమ్‌రెడ్డి, అంజిరెడ్డి, రాంచంద్రారెడ్డి, వెంకట్రాములు గౌడ్, మల్లికార్జున్, మహేందర్ పాల్గొన్నారు.

స్కూల్ వద్ద తల్లిదండ్రుల ఆందోళన

- ఫీజు చెల్లించలేదని విద్యార్థులను లైబ్రరీలో కూర్చోబెట్టారని ఆరోపణ


విలేకరులతో ఆవేదనను వ్యక్తం చేస్తున్న శివప్రసాద్

కీసర, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): స్కూల్ ఫీజు చెల్లించలేదని విద్యార్థులను లైబ్రరీలో కూర్చోబెట్టారని స్కూలు వద్ద తల్లిదండ్రులు ఆందోళన చేసిన ఘటన మంగళవారం నాగారం మున్సిపల్ పరిధి రాంపల్లి దాయరలోని జూబ్లీ హిల్స్ పబ్లిక్ స్కూల్ వద్ద జరిగింది. తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. స్కూల్‌లో 4వ తరగతి చదువుతున్న గౌరీక్, మరో ఇద్దరు ఫీజు చెల్లించలేదని ప్రార్థన అనంతరం లైబ్రరీలో కూర్చోబెట్టారని గౌరీక్ తండ్రి శివప్రసాద్ తెలిపారు. ఇప్పటికే లక్ష రూపాయాల ఫీజు చెల్లించామని, కట్టాల్సిన మరో 30వేలు సర్దుబాటు చేసుకొని రాగా తమను సిబ్బంది లోనికి అనుమతించలేదని వాపోయారు. ఫీజు ఆలస్యంగా చెల్లిస్తే ఫైన్ వేస్తారని చెప్పారు. సీసీ కెమెరాలోనైనా పిల్లల్ని చూపాలని కోరినా సిబ్బంది అంగీకరించలేదన్నాడు. దీంతో శివప్రసాద్ తమ కుమారుడికి టీసీ ఇవ్వాలని కోరిన మీదట గౌరీక్‌ను బయటకు పంపారన్నారు. నిబంధనలు పాటించని ఈ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని శివప్రసాద్ అధికారులను కోరారు. ఈ ఘటనపై యాజమాన్యం స్పందిస్తూ.. ఫీజు చెల్లించాలని తల్లిదండ్రులకు పలుమార్లు ఫోన్లు చేశామని, ఈ-మెయిల్, ఉత్తరాలు పంపామని, అయినా ఫీజు చెల్లించలేదన్నారు. తల్లిదండ్రులు తమతో మాట్లాడకుండానే పదిమందితో వచ్చి స్కూలు వద్ద ఆందోళన చేయడంతో భయాందోళనతో వారిని లోనికి అనుమతించలేదన్నారు. తండ్రి కోరిక మేరకు గౌరీక్‌కు టీసీ ఇచ్చామని తెలిపారు.

రాత్రి పూట చెరువు మట్టి దోపిడీ

- ఐదు టిప్పర్లతో డ్రైవర్ల పరార్
- చోద్యం చూస్తున్న యంత్రాంగం

శామీర్‌పేట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): చెరువు, కుంటల్లోంచి రాత్రి పూట మట్టిని రవాణా చేస్తూ లక్షలు దండుకుంటున్నారు. ఈ అక్రమ తంతు మండలంలో ఏడాదిగా కొనసాగుతోంది. రెవెన్యూ, నీటి పారుదల శాఖల అధికారులు ఏమీ పట్టనట్టే ఉంటున్నారు. సోమవారం రాత్రి లాల్‌గడి మలక్‌పేట కుడిచెరువు నుంచి జేసీబీ, టిప్పర్లతో మట్టిని రవాణా చేశారు. మట్టి దొంగలు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో కుమ్మక్కై మట్టి తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వారు సోమవారం రాత్రి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు చెరువు వద్దకు వెళ్లగా అప్పటికే ఐదు టిప్పర్లను అక్కడి నుంచి తప్పించారు. అధికారులు చెరువు వద్ద హిటాచీ, లారీని సీజ్‌చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మట్టి తరలిస్తున్నవారి పట్ల మొదటి నుంచీ అధికారులు కఠిన చర్యలను తీసుకోవడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు.

పోషకాహారంపై అవగాహన అవసరం

చేవెళ్ల/కొత్తూర్/కందుకూరు,ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): పోషకాహారంపై అవగాహన పెంచుకోవాలని చేవెళ్ల సీడీపీవో హెప్సీబా తెలిపారు. మంగళవారం చేవెళ్లలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. గర్భిణులు, పిల్లలు, బాలింతలు పోషకాహారం తినాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు. అలాగే షాద్‌నగర్ ఐసీడీఎస్ సీడీపీవో షబానా బేగం సమావేశం నిర్వహించారు. గర్భిణులు, తల్లులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కొత్తూర్ మండలం మక్తగూడలో భాగంగా పోషణపక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్ రేవతి, టీచర్ రజీనా, గర్భిణులు పాల్గొన్నారు. పౌష్టికాహారం తీసుకుంటేనే శిశువు ఆరోగ్యంగా జన్మిస్తారని మహేశ్వరం సీడీపీవో శాంతిశ్రీ తెలిపారు. కందుకూరు మండలం కొత్తూరు అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో శాంతిశ్రీ మాట్లాడారు. సూపర్‌వైజర్ ఇందిర, టీచర్ గోవిందమ్మ, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడి సరికాదు

ఆమనగల్లు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): న్యాయవాదిపై దాడిని ఖండిస్తున్నామని న్యాయవాదులు అన్నారు. హైదరాబాద్‌లో న్యాయవాది మహ్మద్ ముస్తబా అలీపై జరిగిన దాడిని నిరసిస్తూ ఆమనగల్లులో మంగళవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అండేకార్ యాదిలాల్ ఆధ్వర్యంలో అడ్వకేట్లు విధులు బహిష్కరించారు. అసోసియేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అడ్వకేట్ల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీనియర్ న్యాయవాదులు జగన్, సుధాకర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి విజయ్‌కుమార్, కృష్ణ, మల్లేశ్, గణేశ్, సంతోష్, మల్లేశ్, దేవేందర్, శ్రీనివాస్, శిరీష్, సర్దార్‌నాయక్ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి దుర్మరణం

- రాజీవ్ రహదారిపై డీసీఎంను ఢీకొన్న టాటా సఫారీ
- ఇద్దరు మృతి.. ఐదుగురికి గాయాలు
- శామీర్‌పేట చెరువు వాగులో మునిగి ఇద్దరు యువకుల మృత్యువాత


డీసీఎం వాహనాన్ని ఢీకొట్టిన సఫారీ

మూడుచింతలపల్లి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లాలోని రెండు మండలాల్లో మంగళవారం జరిగిన వేర్వేరు దుర్ఘటనల్లో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మూడుచింతలపల్లి మండలం తుర్కపల్లి సమీపంలో రాజీవ్ రహదారిపై టాటా సఫారీ వాహనం డీసీఎంను ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు చనిపోయారు. మరో ఘటనలో శామీర్‌పేట్ పెద్ద చెరువు సమీప వాగులో ఈతకు దిగిన ఇద్దరు యువకులు నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదాలపై పోలీసులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. తుర్కపల్లిలోని జినోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం తెల్లవారుజామున రాజీవ్ రహదారిపై డీసీఎం వాహనాన్ని సఫారీ కారు ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు చనిపోగా, ఐదుగురు గాయాలపాలయ్యారు. మురహరిపల్లి నుంచి శామీర్‌పేట్ వైపు వెళ్తున్న సఫారీ కారు ఫారెస్ట్ గెస్ట్‌హౌస్ సమీపంలో డివైడర్‌ను ఢీకొని ఎదురుగా వచ్చిన డీసీఎంను ఢీకొంది. ఈ ప్రమాదంలో సిద్దిపేట జిల్లా వర్గల్‌కు చెందిన రాజు(18), మురహరిపల్లికి చెందిన శ్రవణ్(23) అక్కడికక్కడే మృతిచెందారు. డీసీఎం డ్రైవర్, కారులోని నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రాణాలు తీసిన ఈత సరదా

ఈత సరదా ఇద్దరి ప్రాణాలను బలికొంది. శామీర్‌పేట్ పెద్ద చెరువు సమీపంలోని వాగులో మంగళవారం ఈతకు దిగిన ఇద్దరు యువకులు నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన యశ్వంత్(24), ఏపీకి చెందిన మందకృష్ణ(35), నగరానికి చెందిన మరో ఎనిమిది మంది స్నేహితులు శామీర్‌పేట్ వచ్చి కట్టమైసమ్మ ఆలయంలో దర్శంచుకున్నారు. అనంతరం దావత్ చేసుకున్నారు. అనంతరం పక్కనే ఉన్న పెద్ద చెరువు సమీప వాగులో ఈతకు దిగారు. నీటిలో మునిగి యశ్వంత్, కృష్ణ మృత్యువాత పడ్డారు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు చేరుకొని మృతదేహాలను వెలికితీయించి పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వీరంతా నగరంలో డెలివరీ బాయ్స్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.


యువకుల మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

సైబర్ నేరాల నివారణకు స్పెషల్ ఫోకస్

ప్రజావగాహనకు తాండూరులో శ్రీకారం.. పోస్టర్లు, బ్యానర్ల ప్రదర్శన

తాండూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): అంతరాష్ట్ర వాణిజ్య కేంద్రంగా ఉన్న తాండూరు ప్రాంతంలో సైబర్ నేరాల నివారణకు పోలీసులు దృష్టిపెట్టారు. తాండూరు ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) సహకారంతో పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించేందుకు కార్యాచరణ చేపట్టారు. ప్రజలు ఆర్థిక మోసాలకు గురికాకుండా సలహాలు, సూచనలు ఇస్తున్నారు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సీఐలు, ఎస్‌ఐలు సైబర్ క్రైంల నుంచి ప్రజలను రక్షించేందుకు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసే కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 600 పెద్ద పోస్టర్ల ద్వారా ప్రచారాన్ని చేపట్టేందుకు నిర్ణయించారు.



సైబర్ నేరాల అవగాహనపై ప్రదర్శిస్తున్న బ్యానర్

27రకాల ఆర్థిక నేరాలు

నేడు అనేక రకాలుగా సైబర్ మోసాలు జరుగుతున్నాయి. వీటిల్లో సాధారణంగా జరిగే 27రకాల ఆర్థిక నేరాలను పోలీసు శాఖ గుర్తించింది. సైబర్ క్రైం పోస్టర్ పేరిట బ్యానర్‌ను రూపొందించారు. సైబర్ మోసానికి గురైతే ఏం చేయాలి.. మీ కార్డు బ్లాక్ అయిందని కాలొచ్చిందా? ట్రేడింగ్ యాప్‌లతో జరభద్రం, ఆన్‌లైన్ గేమింగ్‌లతో మోసం, క్రెడిట్ కార్డు వివరాలు ఎవ్వరికీ చెప్పొద్దు.. అంటూ తదితర అంశాలను బొమ్మలతో వివరిస్తున్నారు. ఫ్రాడ్ కాల్స్, ఎస్సెమ్మెస్‌లతో ఎలా జాగ్రత్తగా ఉండాలో పేర్కొంటున్నారు. వాట్సప్‌కు, మెస్సేజ్‌లకు వచ్చే లింక్‌లను క్లిక్ చేయొద్దని సూచిస్తున్నారు. ఫోన్లకొచ్చే ఓటీపీలను ఎవ్వరికీ చెప్పొద్దని, అపరిచితులు ఫోన్ చేసి మీ అకౌంట్లోకి డబ్బులు వేస్తాం.. ఓటీపీ చెప్పాలని అడిగితే చెప్పొద్దని వివరిస్తున్నారు. ఓటీపీ(వన్ టైం పాస్‌వర్డ్) చెల్లింపులకే తప్ప డిపాజిట్లకు ఉండదని ప్రజలు గుర్తించాలని చెబుతున్నారు. మనీ ట్రాన్‌సాక్షన్ యాప్‌లు, బ్యాంకు అకౌంట్/ పిన్ నంబర్లు ఎవరికీ చెప్పొద్దని వివరిస్తున్నారు. ఒక వేళ మోసపోతే వెంటనే ఎలా స్పందించాలి.. ఎవరికి కాల్ చేయాలి? క్రెడిట్/డెబిట్ కార్డుల విషయంలో ఎలా వ్యవహరించాలో బొమ్మలతో పోస్టర్లు, బ్యానర్లు ముద్రించి వివరిస్తున్నారు. ఆన్‌లైన్ ఆర్థిక మోసం జరిగితే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని పోలీసులు సూచిస్తున్నారు.

అప్రమత్తతే రక్షణ..



ప్రజలు సైబర్ మోసాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలి. అపరిచిత మెసేజ్‌లు, ఫోన్‌కాల్స్‌ను నమ్మొద్దు. డబ్బుల విషయంలో ఎలాంటి ప్రలోభాలకు గురికావొద్దు. స్మార్ట్‌ఫోన్ల కాలంలో మోసం చేయడం నేరగాళ్లకు సులువైంది. నేరగాళ్ల నుంచి మీ డబ్బును రక్షించుకోవడం మీ చేతుల్లోనే ఉంది. మోసపోతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలి. దీంతో మోసగాళ్ల బ్యాంకు ఖాతాను ఫ్రీజ్‌చేసి డబ్బు వారు డ్రా చేయకుండా చేస్తాం. అనంతరం డబ్బు పొందే వీలుంది. సైబర్ క్రైమ్ వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదు చేయొచ్చు. యువత అవగాహన పెంచుకొని కుటుంబీకులకు తెలియజెప్పాలి.

బాలకృష్ణారెడ్డి, డీఎస్పీ, తాండూరు

మోసపోకుండా అప్రమత్తం చేస్తున్నాం



సైబర్ క్రైమ్‌లపై ప్రజల్లో చైతన్యం కల్గించేందుకు పోస్టర్లు, బ్యానర్లతో ముద్రించాం. కూడళ్లు, రద్దీ ప్రదేశాల్లో వాటిని ప్రదర్శిస్తున్నాం. దీనిపై తాండూరు ఐఎంఏ పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ పోలీసులకు సహకరించేలా 600 పోస్టర్ల ముద్రించాం. సైబర్ క్రైమ్ జరిగినప్పుడు ఏం చేయాలి? మోసానికి గురికాకుండా ఏ జాగ్రత్తలు తీసుకోవాలో వివరిస్తున్నాం.

- డాక్టర్ జయప్రసాద్, ప్రెసిడెంట్, ఐఎంఏ, తాండూరు


పోస్టర్ విడుదల చేస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి(ఫైల్)

అమ్మో పాము

కొత్తూరు ఎస్సీ కాలనీలో పాముల బెడద



కొత్తూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని ఎస్సీ కాలనీలో తరుచూ పాములు కనిపిస్తుండడంతో కాలనీవాసులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. కొన్నేళ్ల క్రితం ఎస్సీ కాలనీ నుంచి రైల్వే గేట్ వరకు నూతనంగా భూగర్భ డ్రైనేజీ నిర్మించారు. ఆ సమయంలో అక్కడ ఉన్న రాళ్లను పక్కకు వేయడంతో కుప్పగా ఏర్పడి పాములు స్థావరంగా మారింది. రాళ్ల కుప్పను తొలగించాలని మున్సిపాలిటీ అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. పాములు తరుచూ బయటకు వస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పేద కుటుంబాల్లో సంతోషమే ధ్యేయం

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పేదల కుటుంబాల్లో సంతోషమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తూర్‌లో సన్న బియ్యం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం రేవంత్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిములుగౌడ్, నాయకులు భీమ్‌రెడ్డి, అంజిరెడ్డి, రాంచంద్రారెడ్డి, వెంకట్రాములుగౌడ్, మల్లికార్జున్, మహేందర్ పాల్గొన్నారు.

సిద్ధాంతానికి కట్టుబడి పనిచేస్తే గుర్తింపు


సమావేశంలో ప్రసంగిస్తున్న డాక్టర్ లక్ష్మణ్

మన్సూరాబాద్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసే ప్రతీ నాయకుడు, కార్యకర్తకు భారతీయ జనతా పార్టీలో తగిన గుర్తింపు లభిస్తోందని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. సుపరిపాలన దినోత్సవంలో భాగంగా మంగళవారం హైదరాబాద్ మన్సూరాబాద్‌లోని ఎంఈ రెడ్డి గార్డెన్స్‌లో రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి పదవీ స్వీకరణ మహోత్సవాన్ని నిర్వహించారు. అర్బన్ జిల్లా మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథులుగా కె.లక్ష్మణ్, మాల్కాజిగిరి, చేవెళ్ల ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విచ్చేశారు. వారు మాట్లాడుతూ.. శ్రీనివాస్‌రెడ్డి నాయకత్వంలో ప్రతి నాయకుడు, కార్యకర్త అర్బన్ జిల్లా బీజేపీ పటిష్టతకు పాటుపడాలన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీల అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మడం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలోనూ బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి మాజీ సీఎం కేసీఆర్ వైఫల్యమే కారణం అని, తొమ్మిది నెలల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఎంపీ ఈటల విమర్శించారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బల్దియాపై బీజేపీ జెండా ఎగరడం ఖాయమని జోష్యం చెప్పారు. తెలంగాణలో రైతులు ధైర్యంగా ఉన్నారంటే ఇందుకు మోదీ ప్రభుత్వ ధీమానే కారణమని ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. దోచుకోవడం తప్ప బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలకులకు పాలించడం చేతకాదని, ఇందుకు నిదర్శనం ప్రభుత్వ భూములు అమ్ముకోవడమేనని విమర్శించారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు ఏవీఎన్ రెడ్డి, మల్క కొమురయ్య, చిన్నమైల్ అంజిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ధారాసింగ్

రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాలి

పెద్దేముల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాజ్యంగాన్ని పరిరక్షించేందుకు అందరూ పాటుపడాలని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ అన్నారు. పెద్దేముల్‌లో మంగళవారం 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' కార్యక్రమంపై కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమ నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాల ఇన్‌చార్జి ధారాసింగ్ హాజరై జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం ద్వారా రాజ్యాంగ పరిరక్షణకు చేపట్టిన పాదయాత్రను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. భారత్ జోడో యాత్రతో రాహుల్‌గాంధీ దేశైక్యతను చాటిచెప్పారన్నారు. బీజేపీ ప్రభుత్వ అరాచకాలను ప్రజల్లో ఎండగట్టాలని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు గోపాల్, గాజీపూర్ నారాయణరెడ్డి, ఎ-బ్లాక్ అధ్యక్షుడు లొంక నర్సిములు, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్‌కుమార్, మల్లేశం, కిరణ్, డీవై.నర్సిములు, నసీర్, షైపుస్, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


రిటైర్డ్ అదనపు ఎస్పీ మధుసూదన్‌రావు దంపతులను సన్మానిస్తున్న మిత్రులు

స్నేహితుల ప్రోత్సాహంతోనే ఎదిగా

తాండూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): తనకు ప్రతీ విషయంలో చిన్ననాటి నుంచి స్నేహితులు అందించిన ప్రోత్సహంతోనే ఉన్నత స్థాయికి ఎదిగి ఉద్యోగ విరమణ చేశామని రిటైర్డ్ విజిలెన్స్ అదనపు ఎస్పీ మధుసూధన్‌రావు అన్నారు. మంగళవారం అంతారంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో తాండూరులోని స్నేహితులు, ఆత్మీయులు ఏర్పాటు చేసిన అభినందన సత్కార కార్యక్రమంలో మాట్లాడారు. తాను రిటైర్ అయినా టయర్డ్ కాలేదని చెప్పారు. తాండూరు ప్రాంతంలో పుట్టిపెరిగి ఎస్ఐ స్థాయి నుంచి అదనపు ఎస్పీ క్యాడర్ వరకు ఎదిగానని తెలిపారు. ప్రజల సహకారం మరువలేనిదన్నారు. తాను తాండూరులో చదువుకున్న విజయ విద్యాలయం, పీపుల్స్ డిగ్రీ కళాశాల, ఉస్మానియా యూనివర్సిటీలు ఎంతో నేర్పాయన్నారు. ముఖ్య అతిథి సీనియర్ న్యాయవాది కరుణం పురుషోత్తంరావు మాట్లాడుతూ.. మధుసూధన్‌రావు ఒక ట్రస్టును ఏర్పాటు చేసి ప్రజలకు సేవలందించాలని కోరారు. కార్యక్రమానికి మాజీ వైస్ ఎంపీపీ రాజప్ప అధ్యక్షత వహించారు. నాయకులు రాజ్‌కుమార్, రాజుగౌడ్, మంజుల, అన్నపూర్ణ, స్వరూప, బస్వరాజ్, సర్దార్‌ఖాన్, ప్రభాకర్‌గౌడ్, భద్రేశ్వర్, సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుసూధన్‌రావు దంపతులను గజమాలతో సన్మానించారు.

డ్యాన్స్ ఉచిత శిక్షణ కేంద్రం ప్రారంభం



డ్యాన్స్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న భాస్కరయోగి తదితరులు

కొడంగల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): భాషా సాంస్కృతిక శాఖ, ఆర్ఎస్‌పీ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో మాతృ నత్యం ఉచిత శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. మంగళవారం కొడంగల్‌లో ఆధ్యాత్మికవేత్త డాక్టర్ భాస్కర యోగి, మాజీ ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, మున్సిపల్ మాజీ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ కె.శివకుమార్‌గుప్తాల ఆధ్వర్యంలో కేంద్రాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. ఉచిత డ్యాన్స్ తరగతులు ప్రారంభించడం అభినందనీయం అన్నారు. విద్యార్థులు ఈ శిక్షణను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మురారి వశిష్ట, యూత్ కాంగ్రెస్ నాయకులు కృష్ణంరాజు, వైద్యుడు సాకేత్, నవీన పాఠశాల ప్రిన్సిపాల్ నరేశ్‌రాజ్, రాజేందర్, భీమారాజు, అకాడమి మాస్టర్ ప్రకాశ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'జైల్ భరో'ను జయప్రదం చేయాలి

పరిగి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): బహుజనుల పట్ల జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా బీఎంపీ ఆధ్వర్యంలో ఈ నెల 9న చేపట్టనున్న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఎంపీ జిల్లా అధ్యక్షుడు గట్యానాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్‌లు కోరారు. పరిగిలో మంగళవారం జైల్‌భరోపై సమావేశాన్ని నిర్వహించి కార్యక్రమానికి భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. నాయకుడు కొర్ర బాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు భక్తిమార్గంలో నడవాలి


అభిషేకం చేస్తున్న శివనాగేంద్ర స్వామి

ఘట్‌కేసర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు భక్తిమార్గంలో నడిస్తేనే సమాజంలో శాంతి నెలకొంటుందని కాశీపీఠం పీఠాధీశులు పరమహంస శివనాగేంద్ర సరస్వతి స్వామి అన్నారు. ఘట్‌కేసర్ పరిధి ఎన్ఎఫ్‌సీనగర్‌లో గల శివశంకరి వేద పీఠంలో లలితా త్రిపురసుందరి అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవాల చివరి రోజు మంగళవారం ఆయన హాజరై పూజలు నిర్వహించారు. దైవభక్తితో సాధించలేనిదేదీ లేదన్నారు. అష్టోత్తర శత కలశ ఆవాహన, శతకళాభిషేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ సంగీత ప్రభాకర్‌రెడ్డి దంపతులు, డి.జితేందర్‌రెడ్డి, సుబ్బారావు, ప్రసాద్, శోభారాణి, సుజాత, నిర్వాహకుడు కాశీ కోటేశ్వరశర్మ, భక్తులు పాల్గొన్నారు.

'ఫంకు ఇండియా' స్కామ్‌లో ఒకరి అరెస్టు

హైదరాబాద్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): తమ కంపెనీలో పెట్టుబడి పెడితే స్వల్పకాలంలో 300 నుంచి 400 శాతం లాభం వస్తుందంటూ ప్రచారం చేసి కోట్ల రూపాయలు కొల్లగొట్టిన ఫంకు ఇండియా చీటింగ్ కేసులో తోకల మధుసూధన్‌ను అరెస్టు చేశామని సీఐడీ డీజీ శిఖా గోయల్ మంగళవారం తెలిపారు. ఫంకు ఇండియా సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రమోటర్ వందిత ద్వారా ఘట్‌కేసర్ ప్రాంతానికి చెందిన తోకల మధుసూదన్ ఈ చీటింగ్ ముఠాలో ఏజంట్‌గా చేరాడని, అతడు పెట్టుబడికి తొలిదశలో భారీగా లాభమొచ్చిందని చెప్పారు. మరికొందరి ద్వారా ఈ కంపెనీలో పెట్టుబడులు పెట్టిస్తే ఒక్కొక్క రిఫరెన్స్ ద్వారా 11శాతం కమిషన్ చెల్లిస్తామని వందిత చెప్పడంతో మధుసూదన్ నేరేడ్‌మెట్‌లో ఓ సమావేశం ఏర్పాటు చేసి తమ కంపెనీ గురించి చెప్పి పలువురితో భారీగా పెట్టుబడులు పెట్టించాడని ఆమె తెలిపారు. ఆ తర్వాత కంపెనీ బోర్డు తిప్పేయడంతో గత ఏడాది సీఐడీ దర్యాప్తు ప్రారంభించి మూడో నిందితుడైన మధుసూధన్‌ను అరెస్టు చేశామని ఆమె వివరించారు.

బీజేపీ కుట్రలను తిప్పికొడతాం



బషీరాబాద్‌లో పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బషీరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కుట్రలను తిప్పికొడతామని బషీరాబాద్ ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కలాల్ నర్సింహులుగౌడ్, అన్నారు. మండలంలోని ఏకాంబర రామలింగేశ్వరాయం వద్ద అంబేడ్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలకు మంగళవారం నివాళులర్పించారు. అనంతరం జై బాపు, జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ నాయకులు రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను ప్రారంభించారు. ఎమ్మెల్యే ఆదేశానుసారం ఇస్మాయిల్‌పూర్, నీళ్లపల్లి, జలాల్‌పూర్, మర్పల్లి, పర్వత్‌పల్లి, నీళ్లపల్లి మీదుగా పాదయాత్ర నిర్వహించారు ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్, లక్ష్మణ్‌రావు, బి.నర్సిరెడ్డి, రాముూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలి

తాండూరు రూరల్: రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తాండూరు నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తుపాకుల అనిల్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జెర్నె నాగప్ప పిలుపునిచ్చారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమాలపై చెనిగేష్‌పూర్, ఎల్మకన్నె, చెంగోల్, పర్వతాపూర్, చింతామణిపట్నం తదితర గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడు ఎస్.రవీందర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగప్ప, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉదయ భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కరన్‌కోట్ జగదీశ్వర్ తదితరులున్నారు.

ఇళ్ల నిర్మాణంపై అనాసక్తి!

- బషీరాబాద్ మండలం కాశింపూర్‌నకు 93 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు
- 15ఇళ్లకు మించి ప్రారంభం కాని పనులు

బషీరాబాద్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పత్రాలు మంజూరై నెల రోజులకు పైగా గడుసున్నా పూర్తి స్థాయిలో పనులు ప్రారంభంకావడంలేదు. ఎన్నో ఏళ్లకు పేదల సొంతింటి కల నేరవర్చుకునే అవకాశం వచ్చినా ఆ దిశగా నిర్మాణ పనులు కొనసాగడంలేదు. ఇళ్లు మంజూరైందనే సంతోషం లబ్ధిదారుల్లో ఉన్నా ఆర్థికలేమితో కొట్టుమిట్టడుతున్నారు. దీంతో ఆశించిన స్థాయిలో ఇళ్ల నిర్మాణాలు జరగడంలేదనే చర్చ ప్రజల్లో వినిపిస్తున్నాయి. మండలంలో పైలట్ ప్రాజెక్టు కింద కాశింపూర్ గ్రామాన్ని ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లకు



కాశింపూర్‌లో బెస్‌మెంట్ వరకు పూర్తయిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం



ఇంటి నిర్మాణానికి ముగ్గు వేసి రోజులు గడుస్తున్నా ప్రారంభం కాని పనులు

ఎంపిక చేసింది. ఈ క్రమంలో గ్రామంలో 193మంది అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేసి పత్రాలు అందజేసింది. మొత్తం ఎస్సీ, ఎస్టీలకు రూ.6లక్షలు, మిగిలిన వర్గాలకు రూ.5లక్షల చొప్పున ఇంటి నిర్మాణానికి బిల్లులు ఇస్తారు. దరఖాస్తు సమయంలో ఆసక్తి చూపిన ప్రజలు ఇళ్లు మంజూరయ్యాక నిర్మాణంపై అనాసక్తి చూపుతున్నారు. నెల రోజుల్లో 15ఇళ్ల నిర్మాణ పనులు మాత్రమే ప్రారంభమయ్యాయి. వీటిలో రెండు బెస్‌మెంట్ పూర్తికాగా, మిగతా ఇళ్లు ప్రారంభదశలో ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. నిబంధనల ప్రకారం పునాది తీసిన తర్వాత యాప్ సాయంతో ఇంటి నిర్మాణ స్థితిని అధికారులు ప్రభుత్వానికి నివేదిస్తారు. అప్పుడే లబ్ధిదారుల ఖాతాలో రూ.లక్ష జమ అవుతాయి. మిగతా డబ్బులు కూడా మూడు విడతల్లో జమవుతాయి. ఇదిలాఉండగా పునాది దశ ఖర్చు భరించలేక కొందరు తటపటాయిస్తున్నట్లు తెలుస్తోంది. లబ్ధిదారుల్లో కొంత మంది ఇప్పటికే పైకప్పు రేకులు వేసుకుని ఉంటుండటంతో దానిపై స్లాబ్ వేసుకుంటే ఇంటి బిల్లు ఇస్తే బాగుంటుందనే అభిప్రాయం స్థానికంగా వ్యక్తమవుతోంది. తమ వద్ద డబ్బులు ఉంటే శిథిలా వస్థలో ఇళ్లలో ఎందుకుంటామని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇళ్ల నిర్మాణంలో యాప్‌లు, దశల వారీగా ఫొటోలు తీసి పంపిస్తే బిల్లులు వస్తాయని, ఇందులో అవకతవకలకు తావు లేదని అధికారులు లబ్ధిదారుల వద్దకు వెళ్లి చెబుతున్నా ఫలితం కనిపించడంలేదు. ఇంటి బిల్లులు సకాలంలో రాకుంటే పరిస్థితి ఎంటనే సందేహంలో మరి కొందరు లబ్ధిదారులు సతమతమవుతున్నారు. స్తోమత లేక ఇంటి నిర్మాణానికి మొగ్గు చూపని వారు కొందరైతే.. మరి కొందరు ముహూర్తాలు బాగాలేవని, వివిధ కారణాలు చెబుతూ దాటవేస్తున్నారని అధికారులు అంటున్నారు.

బిల్లులు ఇప్పించే బాధ్యత మాది

ఇందిరమ్మ ఇల్లు కట్టుకున్న వారికి బిల్లులు ఇప్పించే బాధ్యత మాది. ఇంటింటికి వెళ్లి ఇందిరమ్మ కమిటీల ద్వారా ఇళ్లు కట్టుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం. కొందరు అప్పుడు, ఇప్పుడు అంటూ దాటవేస్తున్నారు. దీంతో లక్ష్యం పూర్తి చేయడం ఆలస్యమవుతోంది.

- అశోక్, పంచాయతీ కార్యదర్శి

నాపరాయి రాయల్టీపై రచ్చ!

(ఐదో పేజీ తరువాయి)

నాపరాయికి జీఎస్టీ, సేల్‌ట్యాక్స్, తమ నాపరాయి తాండూరులో పాలిషింగ్ చేస్తే వచ్చే విద్యుత్ బిల్లు ఆదాయాలు మొత్తం తెలంగాణ ప్రభుత్వానికే చెందుతున్నాయని సోమవారం కర్ణాటక మిరియణ్ నాపరాయి వ్యాపారస్తులు మైన్స్ ఏడీకి విన్నవించారు.

పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు

కాగా, రాయల్టీలో కర్నాటకకు మన రాష్ట్రానికి భారీగా తేడా ఉంది. కర్నాటకలో ఒక లారీ నాపరాయికి రూ.700 చొప్పున వసూల్ చేస్తుండగా తెలంగాణలో రూ. 2,700 వసూలు చేస్తున్నారు. ఇటీవల మైన్స్ అధికారులు తాండూరు మండలం ఒగిపూర్, మల్కాపూర్, కరన్‌కోట్ నుంచి వచ్చే నాపరాయి లారీలను కర్నాటక రాష్ట్రం మిరాయణ్ నుంచి వస్తున్న నాపరాతి లారీల తరహా తప్పనిసరి రాయల్టీలు ఉంటేనే అనుమతిస్తున్నారు. కాగా, ఇప్పటికే పలు లారీలను కూడ సీజ్ చేయగా అడ్డుకునే ప్రయత్నం చేసిన తాండూరు వ్యాపార ప్రతినిధులపై పోలీసులకు ఫిర్యాదు సైతం చేశారు. మైన్స్ ఉన్నతాధికారులు హెచ్చరికలు జారీ చేయడం రాజకీయ ఆదిపత్య పోరులో అధికార పార్టీకి చెందిన ప్రముఖ నేత రాష్ట్ర మైన్స్ అధికారులకు ఫిర్యాదులు చేయడం, దాడులు చేయాలని ఆదేశించడంతో తాండూరు నాపరాయి వ్యాపారం అసలు విషయాన్ని గుట్టరట్టు అయింది.

11న సమావేశం!

కాగా, కర్నాటక రాష్ట్రం మిరాయణ్‌కు చెందిన కొంత మంది నాపరాయి వ్యాపారులు తమ ప్రాంతానికి చెందిన ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్‌ఖర్గే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఈ సమస్యను తేల్చాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలియజేసినట్లు సమాచారం.



తాండూరులో సీజ్‌చేసిన లారీలు(ఫైల్)

తాండూరుకు చెందిన నాపరాయి వ్యాపార ప్రతినిధులు కూడా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కలిసి తమ బాధను తెలిపారు. ఈ విషయమై మనోహర్‌రెడ్డి కూడా మైన్స్ ఏడీకి ఫోన్ చేసి సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించినట్టు సమాచారం. అయితే ఈ విషయమై 11న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కర్నాటక రాష్ట్రం మిరియణ్‌కు చెందిన ముగ్గురు నాపరాతి వ్యాపారులు, తెలంగాణ రాష్ట్రం తాండూరు ప్రాంతానికి చెందిన ముగ్గురు వ్యాపారులతో సమస్యపై చర్చించేందుకు రావాలని సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

దుద్యాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు వెంకటయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్ అన్నారు. మండలంలోని చెట్టుపల్లి తండాలో సీసీ రోడ్డు పనులను మంగళవారం వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేశ్‌నాయక్, రాజేందర్ చవాన్, రతన్ రాథోడ్ పాల్గొన్నారు.

కులకచర్ల: మండలంలోని సాల్విడ్ గ్రామంలో మంగళవారం సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఉపాధి హామీ నిధులు రూ.6లక్షలతో కాంగ్రెస్ నాయకులు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు బాలయ్య, రాములు, నాయకులు నర్సింహులు పాల్గొన్నారు.

పూడూరు: మండలంలోని చింతలపల్లిలో సీసీ రోడ్డు పనులను మంగళవారం సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు మెంబర్, ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మల్లేష్ పటేల్, మండల అధ్యక్షుడు తుంపల్లి రాఘవేందర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటన్న, మండల ఉపాధ్యక్షుడు నరేష్, సుభాన్ పాల్గొన్నారు.

దౌల్తాబాద్: మండల కేంద్రంలో లింగయ్య ఇంటి నుంచి కౌడీడ్ వరకు బీటీ రోడ్డు పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్రావ్ మంగళవారం ప్రారంభించారు. గ్రామాలు, తండాలకు బీటీరోడ్లు వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వరన్న, నర్సింహులు, సేవ్యానాయక్, దస్తప్ప పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



నవీన్ మిట్టల్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ

కీసర, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): చీర్యాల్ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ 17వ వార్షికోత్సవాల బ్రహ్మోత్సవాలకు మంగళవారం ఆలయ నిర్వహకులు ప్రముఖులకు ఆహ్వానం అందజేశారు. ఈనెల 24వ తేది నుండి 27వ తేది వరకు చీర్యాల్‌లో శ్రీ లక్ష్మీ నరసింహ్మా స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం జరుగుతుంది. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్‌కు, మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్‌లకు ఆహ్వాన పత్రిక అందజేయడం జరిగింది.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల 'స్వచ్ఛభారత్'

కొడంగల్ రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): చిట్లపల్లిలోని కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మంగళవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. వేసవి ప్రత్యేక శిబిరంలో భాగంగా ఐదోరోజు గ్రామంలోని ప్రధాన రోడ్లపై చెత్తాచెదారాన్ని శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సోమ్లా, అన్నపూర్ణ, స్వప్న, వైద్యుడు జైపాల్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

కొడంగల్ రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దని ఎస్ఐ జీవీ.సత్యనారాయణ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, రాంబాబు, ఆర్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

పరిగి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ సంతోష్‌లు కోరారు. రంగంపల్లిలో మంగళవారం సీసీ కెమెరాలపై ఏర్పాటుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీవైఎస్ ఎంపీపీ కావలి సత్యనారాయణ, నాయకులు నరహరి, వీరారెడ్డి పాల్గొన్నారు.

ఎక్మాయి ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



సంఘం నూతన అధ్యక్షుడితో కార్యవర్గ సభ్యులు

బషీరాబాద్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఎక్మాయి గ్రామం ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముదిరాజ్ అధ్యక్షుడిగా తుప్పుడు మహేష్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా బి.పాండు, సభ్యులుగా బోయిని నర్సింహులు, జీడీ శామయ్య, తుప్పుడు నర్సింహ, శ్యామ్, బి.జగ్గప్ప, నాటుకారి సాయిలు, ఎస్.శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని స్థానిక ప్రజలు పూల మాల, శాలువలతో ఘనంగా సత్కరించారు.

ప్రైవేట్‌కు దీటుగా నిల'బడి'!

(ఐదో పేజీ తరువాయి)

తీసుకోవాల్సిన చర్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చింది. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని, అవసరమైన అన్ని ప్రయత్నాలు చేయాల్సిందేనని సీఎం.. విద్యాశాఖ అధికారులకు స్పష్టం చేశారు. సీఎం ఆదేశాల నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసింది. పాఠశాలల బలోపేతం, విద్యార్థుల చేరికల పెంపు కోసం ఏ విధంగా ముందుకు సాగాలనేది విద్యా పరిశోధన, శిక్షణా మండలి (టీజీఎస్‌సీఈఆర్టీ) ఇప్పటికే తగు సూచనలతో శిక్షణా కార్యక్రమాలు రూపొందించింది.

ప్రైవేట్‌కు దీటుగా వసతులు

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. 'అమ్మ' ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలల్లో కనీస వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టారు. పాఠశాలల్లో విద్యుద్దీకరణ, టాయిలెట్ల మరమ్మతులు, తాగునీటి సదుపాయం తదితర సదుపాయాల పనులు చేపట్టారు. జిల్లాలో ఇప్పటికే 225 పాఠశాలల్లో డిజిటల్ విద్యా బోధన కొనసాగుతోంది. ఈ పాఠశాలలకు 712 ఐఎఫ్‌పీ ప్యానెళ్లు, 940 పాఠశాలలకు 3,187 గ్రీన్‌చాక్ బోర్డులు, 842 పాఠశాలల్లో 23,559 డ్యుయల్ డెస్కులు అందజేశారు. జిల్లాలో 4,648 ఉపాధ్యాయ పోస్టులు ఉండగా, ప్రస్తుతం 4,235 మంది వరకు పనిచేస్తున్నారు. గతేడాది కొత్తగా ఉపాధ్యాయులను నియమించారు. వచ్చే విద్యా సంవత్సరంలో మరి కొంతమంది కొత్త ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే అవకాశం ఉంది. పాఠశాలల నిర్వహణ కోసం ఏటా రూ.17 కోట్ల వరకు నిధులు వెచ్చిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక విద్యా బోధనలో భాగంగా గత నెలలో జిల్లాలో విద్యా శాఖ కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ - ఏఐ)ను ప్రారంభించింది. తొలి విడతలో ఎంపిక ప్రాథమిక పాఠశాలల్లోనే ఏఐ ప్రారంభించారు. చదువుల్లో వెనకబడిన విద్యార్థులను ఏఐ ద్వారా ప్రోత్సహించేందుకు ఎంపిక చేసిన పాఠశాలలకు 4 నుంచి 5 కంప్యూటర్లు, ఇంటర్నెట్ సదుపాయం, హెడ్‌ఫోన్లు వంటివి సమకూర్చారు. ఏఐ సహకారంతో ఏ విధంగా విద్యార్థులు ఆయా సబ్జెక్టుల్లో ఏ విధంగా ప్రావీణ్యాన్ని పెంపొందించుకోవచ్చనేది ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పించారు. కృత్రిమ మేధ సహకారంతో విద్యార్థులు తమ చదువులను మెరుగు పరుచుకునేలా సాధన చేస్తున్నారు. కృత్రిమ మేధ ప్రారంభించిన నెల రోజుల్లో విద్యార్థుల చదువుల్లో మంచి ప్రగతి కనిపిస్తోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

ఆలయ హుండీ ఆదాయం రూ.10.75లక్షలు



హుండీ లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

యాలాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జుంటుపల్లి సీతారాముల దేవాలయం హుండీ మంగళవారం ఆలయ సిబ్బంది లెక్కించారు. ఆలయ చైర్మన్ శ్యాంసుందర్‌రావు, అనంతగిరి దేవాలయం ఈవో నరేందర్, జుంటుపల్లి దేవాలయం మేనేజర్ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో హుండీ లెక్కించగా మొత్తం దేవాలయానికి రూ.10లక్షల 75వేల 866ల ఆదాయం వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

చెరువులో మురుగునీరు కలపొద్దు

కీసర, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కీసరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని మురుగునీరును పక్కనే ఉన్న చెరువులోకి కలిపేందుకు పైపులైన్ వేశారు. దీంతో విషయం తెలుసుకున్న స్నేహకాలనీ వాసులు ఆసుపత్రి వద్ద ఆందోళన చేశారు. చెరువులోకి మురుగునీరు కలపొద్దని కోరారు.

సంక్షిప్తంగా..

ప్రజల దాహార్తిని తీర్చడానికే చలివేంద్రాలు

ఘట్‌కేసర్ రూరల్: ప్రజల దాహార్తిని తీర్చడానికే చలివేంద్రాలు దోహదపడతాయని మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, అంకుశాపూర్‌లోని జ్ఞానకేంద్రం వద్ద మంగళవారం సీనియర్ జర్నలిస్టు పిట్టల నర్సింగ్‌రావు జ్ఞాపకార్థం ముచుకుంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చిలక గణేష్, వెంకటేష్, రాజు, కోకిల, ప్రియాంక, గణేష్, నర్సింహాచారి, పిట్టల శివ ముదిరాజ్, పిట్టల మంగ, పక్కీర, రమేష్ పాల్గొన్నారు.

యూపీపీఎస్‌సీ బోధనకు దరఖాస్తుల ఆహ్వానం

ఘట్‌కేసర్ రూరల్: అంకుశాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలల క్యాంపస్‌లో యూపీపీఎస్‌సీ కోచింగ్(ఎఎఫ్‌సీఎటీ, ఈడీఎస్, అర్అర్‌బీ, అర్‌పీఎస్ వంటి కాంపిటీటివ్ పరీక్షలకు) శిక్షణ ఇవ్వడానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఆర్మీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శారద తెలిపారు. జనరల్ ఇంగ్లీష్, జనరల్ అవేర్‌నెస్, మాథ్యుమెటికల్ ఆప్టిట్యూడ్ అండర్ రీజనింగ్, జనరల్ సైన్స్ మొదలైన సబ్జెక్టులు బోధించడానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9010519559 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నీటి సమస్య తలెత్తకుండా చూడాలి

బషీరాబాద్: వేసవి దృష్ట్యా గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చూడాలని బషీరాబాద్ తహసీల్దార్, గ్రామ ప్రత్యేకాధికారి వై.వెంకటేష్ గ్రామ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని మంతన్‌గౌడ్, మంతన్‌గౌడ్‌తండా పంచాయతీలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీ రికార్డులు పరిశీలిస్తూ పలు అంశాలపై కార్యదర్శులతో చర్చించారు. అనంతరం గ్రామ సమస్యలపై ఆరా తీస్తూ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు.

యూనిఫామ్ అందజేత

బొంరాస్‌పేట్: మండలంలోని ఏర్పుమళ్ల యూపీఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులకు 2025-26 విద్యాసంవత్సరానికి ఏరూప దుస్తులకు సంబంధించిన మెటీరియల్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి మంగళవారం మహిళా సంఘాల సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

కొడంగల్: 18 సంవత్సరాలు నిండిన అర్హులైన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా సవరణ, మార్పులు, చేర్పులు, మృతి చెందిన వారి పేర్ల తొలగింపుపై అవగాహన కల్పించాలని కోరారు. అదే విధంగా పోలింగ్ బూత్‌ల వారీగా బీఎల్ఏలను నియమించుకోవాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్‌లు అనిత, శ్రీనివాస్, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ పోస్టర్ ఆవిష్కరణ

చౌడాపూర్: ఈ నెల 12న చౌడాపూర్ మండలంలోని పుట్టపహాడ్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ పోస్టర్‌ను మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్పటి అశోక్ కుమార్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రభు, కొత్తపల్లి చెన్నయ్య, భరత్‌కుమార్, నసీర్, కుమ్మరి అంజయ్య, గోపాల్, నర్సిములు, వెంకటేశ్, యాదయ్య, నవీన్, మల్లేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

మేడ్చల్ టౌన్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం 'ఈక్వల్ ఎక్సెస్ టూ ఎడ్యుకేషన్' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యం గుర్తింపు పత్రాలను, బహుమతులను అందజేశారు.

మఠంలో మజ్జన కార్యక్రమం

దుద్యాల: దుద్యాల మండల కేంద్రంలో మంగళవారం శ్రీ మహంతేశ స్వామివారి మఠంలో మజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మజ్జన జల కుంభములతో గ్రామంలోని పురవీధుల మీదుగా ఊరేగింపు నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పతంజలి యోగా ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద అన్నదానం

శామీర్‌పేట: మండల కేంద్రంలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం నిర్వాహకులు అన్నదానం చేపట్టారు. ఆ ఆలయంలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబాగూడకు చెందిన కాసాల రవిందర్‌గౌడ్, రమాదేవి దంపతులు, కాసాల స్నేహ, ఎన్.రాజుగౌడ్, స్వాతి దంపతులు, ఎన్.సాయికిరణ్ గౌడ్, శ్వేత దంపతులు, విశాఖపట్నంకు చెందిన సరస్వతి గౌడ్, మంచాల రవీందర్, రమాదేవి దంపతులు, అలాగే హరికృష్ణ, స్వాతి వారి కుటుంబ సభ్యులు అన్నదానం చేపట్టారు. ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని వివిధ గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, భక్తులు, భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

మోమిన్‌పేట్: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, ఏవీఎన్ రెడ్డిలను మోమిన్‌పేట్ మండల తపస్ సంఘం కార్యవర్గ సభ్యులు మంగళవారం హైదరాబాద్‌లో కలిశారు. తపస్‌కు ఓడీ సౌకర్యం రావడంతో కృతజ్ఞతలు తెలిపారు.

క్రైం కార్నర్

గుండెపోటుతో మరో విద్యార్థి మృతి

- సీఎంఆర్ కళాశాలలో ఘటన

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో గుండెపోటుతో మరో విద్యార్థి మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. కళాశాల విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం మెదక్ జిల్లా తూప్రాన్‌కు చెంది సుమంత్(21) అనే విద్యార్థి సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ మూడో సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం కళాశాలకు వచ్చిన సుమంత్‌కు ఛాతీ నొప్పి రావటంతో తోటి విద్యార్థులు, కళాశాల యాజమాన్యం ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. ఇటీవల సీఎంఆర్ కళాశాలలో క్రికెట్ ఆడుతున్న క్రమంలో ఓ విద్యార్థి గుండెపోటుతో మృతిచెందిన ఘటన నుంచి విద్యార్థులు కోలుకోక ముందే మరో విద్యార్థి గుండె నొప్పితో మృతి చెందడం పట్ల విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది.

ఇరువర్గాల ఘర్షణ

- పోలీసులు ఉండగానే దాడులు
- ఎస్పీ కార్యాలయం ఎదుట గ్రామస్తుల ఆందోళన

వికారాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పోలీసుల సమక్షంలోనే ఓ వర్గం తమపై దాడి చేస్తుందని మరో వర్గం ఆరోపిస్తూ ఎస్పీ కార్యాలయానికి చేరుకుని ధర్నా నిర్వహించిన ఘటన వికారాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కోట్‌పల్లి మండలం కరీంపూర్ గ్రామానికి చెందిన రెండు వర్గాలకు కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. తాజాగా ఐదు రోజులుగా గ్రామంలో ఆజామ్ అనే వ్యక్తి అప్పు, మైసయ్య ఇళ్లలోకి చొరబడి ఆడపడుచులను దుర్భాషలాడటంతో గ్రామస్తులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పంచనామా కోసం గ్రామంలోకి పోలీసులు రాగా వారి సమక్షంలోనే మరో యువకుడిని కొట్టి గాయపర్చడంతో మంగళవారం గ్రామస్తులు పెద్దఎత్తున ఎస్పీ కార్యాలయానికి తరలివచ్చారు. ఎస్పీ కార్యాలయం వద్ద బైఠాయించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి అక్కడకు చేరుకుని జరిగిన విషయాన్ని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. యువకుడిపై దాడి విషయంలో ఫిర్యాదు చేస్తే ఎఫ్ఐఆర్ చేస్తామని, అందుకు తగ్గ ఆధారాలు చూపించాలని తెలిపారు. ఈ విషయమై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయిస్తామని గ్రామస్తులు, బీఆర్ఎస్ నాయకుడు అనిల్, గ్రామస్తులు అప్పు, మైసయ్య తెలిపారు.

పుస్తెలతాడు అపహరణకు యత్నం

- నిందితురాలికి దేహశుద్ధి
- పోలీసులకు అప్పగింత

మూడుచింతలపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు అపహరించేందుకు యత్నించిన మహిళకు ప్రయాణికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నాగిశెట్టిపల్లికి చెందిన పార్వతి(65) నగరం నుంచి ఇంటికిరావడానికి లాల్‌బజార్ వద్ద సికింద్రాబాద్-కాశిరెడ్డిపల్లి బస్సు ఎక్కింది. బస్సులో రద్దీగా ఉండడంతో అదను చూసి ఓ మహిళ వృద్ధురాలి మెడలో నుంచి నాలుగు తులాల పుస్తెలతాడు అపహరించింది. తూంకుంట పరిధిలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ వద్దకు రాగానే పథకం ప్రకారం తనకు ఆరోగ్యం సహకరించడం లేదని నిందితురాలు బస్సు దిగి పక్కనే ఉన్న పొదల్లోకి పారిపోయింది. అనుమానం వచ్చిన వృద్ధురాలు మెడలో చూసేసరికి పుస్తెలతాడు లేదు. వెంటనే బస్సు డ్రైవర్‌తో పాటు తోటి ప్రయాణికులు వెంబడించి నిందితురాలిని పట్టుకుని తనిఖీ చేయగా పుస్తెలతాడు లభ్యమైంది. దీంతో నిందితురాలికి ప్రయాణికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ అదృశ్యం



ఉట్కూర్ నర్సమ్మ

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : ఓ మహిళ అదృశ్యమైన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీసుస్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం. నారాయణపేట్ జిల్లా, ఉట్కూర్ మండలం, మగ్దంపూర్‌కు చెందిన ఉట్కూర్ నర్సమ్మ తన మనుమడు నర్సింహ్మలు ఆయన బార్యపిల్లలతో కలిసి జీవనోపాధికోసం పోచారం మున్సిపాలిటీ, కొర్రెములకు గత ఆరునెలల క్రితం వచ్చింది. నర్సమ్మ గత కొన్నిరోజుల క్రితం నుంచి పక్షవాతంతో బాధపడుతూ కర్ర సహాయంతో నడుస్తుంది. కాగా మంగళవా రం సాయంత్రం నర్సమ్మ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె కుటుంబసభ్యులు తెలిసిన వారిని బంధువులను విచారించిన ఫలితం లేకపోవడంతో మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం రాత్రి బొంరాస్‌పేట్ మండలంలోని మహంతీపూర్ వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్‌లను రేగడిమైలారంలో పట్టుకున్నారు. ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి డ్రైవర్లు బందెయ్య, మహేందర్, అంజిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా ఎస్సీసెల్ కన్వీనర్‌గా నర్సింగ్‌రావు

కీసర, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా ఎస్సీసెల్ కన్వీనర్‌గా దమ్మాయిగూడ మున్సిపల్, చీర్యాల్‌కు చెందిన బక్కని నర్సింగ్‌రావును నియమించారు. ఈమేరకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి బోయిన్‌పల్లిలోని తన నివాసంలో బక్కని నర్సింగ్‌రావుకు నియామకపత్రం అందజేశారు. తనను నియమించిన సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డికి, తోటకూర వజ్రేష్‌యాదవ్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కీసర మండల అధ్యక్షుడు కోల కృష్ణ, రమేష్‌గుప్తా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు పనులను వేగవంతం చేయాలి

కొడంగల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పనులను వేగవంతం చేయాలని పీఆర్ డీఈ సురేందర్‌రావు కాంట్రాక్టర్‌కు సూచించారు. చిట్లపల్లి కమాన్ నుంచి అంగడిరైచూర్ వరకు డబుల్ రోడ్డు మంజూరైంది. రోడ్డు, కల్వర్టు పనులను పరిశీలించి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. పనులను నాణ్యతగా చేపట్టాలని సూచించారు.

ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యం

కీసర రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అర్హులైన విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించటమే కేజీఆర్ కళాశాల లక్ష్యమని డైరెక్టర్ పీవీ.రమణారావు అన్నారు. నాగారం మున్సిపల్ పరిధి రాంపల్లిలోని కేజీఆర్ కాలేజీలో మంగళవారం యశోద అస్పత్రి ఆధ్వర్యంలో కాంపస్ రిక్రూట్‌మెంట్ నిర్వహించారు. అర్హులైన 26 మంది విద్యార్థులకు ఎంపిక చేసి, నియామక పత్రాలు అందజేసినట్లు యశోద అస్పత్రి ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ రామారావు, కేజీఆర్ కళాశాల డైరెక్టర్ పీ.వి. రమణారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గోవిందరెడ్డి పాల్గొన్నారు.